క్లుప్తంగా

పకడ్బందీగా రీ సర్వే జరగాలి



రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

పాణ్యం: భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. గురువారం నెరవాడ గ్రామంలో రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా చుట్టుపక్కల రైతులకు నోటీసులు అందించి, ఎలాంటి ఇబ్బంది లేకుండా రీ సర్వే చేయాలన్నారు. రీ సర్వే పూర్తయిన వెంటనే హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు గురువారం డ్యాం అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 0.688 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని వారు తెలిపారు.

నేడు బొల్లవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గడివేముల: మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటారన్నారు.

ఇన్‌చార్జ్ ఏడీగా అనిల్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీగా అనిల్‌కుమార్‌ను ఉన్నతాధికారులు నియమించడంతో ఆయన గురువారం బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఆసుపత్రిలో అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

పెరుగుతున్న ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరిగాయి. ఈ నెల 18న క్వింటాల్ రూ.3,130 ఉన్న ఉల్లి ధర 19న రూ.3,331 చేరింది. గురువారం 37 మంది రైతులు 1,156 క్వింటాళ్ల ఉల్లిని తెచ్చి మార్కెట్‌లో విక్రయించుకున్నారు. కనిష్ట ధర రూ.1950, గరిష్ట ధర రూ.3,331 లభించింది. మోడల్ ధర రూ.2,839 నమోదైంది. ఎండుమిర్చి మార్కెట్‌కు 5 లాట్‌లు వచ్చింది. కనిష్ట ధర రూ.10,501, గరిష్ట ధర రూ.21వేలు కాగా మోడల్ ధర రూ.16,199 నమోదైంది. మొక్కజొన్నలు 153 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.1,651, గరిష్ట ధర రూ.2,005 లభించగా.. మోడల్ ధర రూ.1,882 నమోదైంది.

రజకులకు రక్షణ చట్టం తేవాలి

కర్నూలు(సెంట్రల్): రజకుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని తేవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం పూలకుంట గ్రామంలోని కొల్లాపురమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న రజక కుటుంబంపై ఆ గ్రామ సర్పంచ్ మంజునాథ్, అతని అనుచరులు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ముక్కన్న, శేషాద్రి, శ్రీనివాసులు, జయమ్మ, రాముడు పాల్గొన్నారు.

సంతాపం

కర్నూలు (సెంట్రల్): సీపీఐ మద్దికెర మండల నాయకుడు అనుమప్ప అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని, ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమప్ప కుటుంబ సభ్యులకు పార్టీ జిల్లా సమితి తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

కర్నూలు సిటీ: మండల పరిధిలోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సి.రాజేశ్వరమ్మను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాలయ అధికారి వెంకట కృష్ణారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిడ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేసిన సమయంలో సి.రాజేశ్వరమ్మ ఆ స్కూల్‌లో మన బడి నాడు–నేడు పనులు జరిగాయి. పనుల్లో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. జిల్లా అధికారుల ముందస్తు అనుమతులు లేకుండా జిల్లా కేంద్రం వదిలి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ఈసీ మెంబర్ల నియామకం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పలువురు ఉమ్మడి జిల్లా వాసులు నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రంగోల గోపి శ్రీనివాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా నుంచి కొండా చిన్న మద్దిలేటయ్య, కల్లూరు మండలానికి చెందిన బలిజచముకుల వీరప్ప, కర్నూలు జిల్లా నుంచి వడ్డే శ్రీనివాసులు ఈసీ మెంబర్లుగా ఎంపికయ్యారు.

ప్రజల ఆరోగ్యానికి సురక్ష శిబిరాలు భరోసా

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: ప్రజల ఆరోగ్యానికి సురక్ష శిబిరాలు భరోసా ఇస్తున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు మండల పరిధిలోని గొందిపర్ల పంచాయతీ వసంత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి, మరిన్ని వ్యాధులను చేర్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే డాక్టర్లను పంపి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం శిబిరంలోని వివిధ స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించి, వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీడీఓ అజాం ఖాన్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, స్థానిక నాయకులు గోపాల్, తిమ్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సూర్యచంద్రారెడ్డి, భరత్‌రెడ్డి, రాజశేఖర్, తిమ్మప్ప, గౌస్, ఆనందం, లక్ష్మన్న, సవారి, వైద్యులు పాల్గొన్నారు.



వసంత్‌నగర్‌లో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్‌లో పౌష్టికాహారాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

ప్యాలకుర్తి గ్రామంలో..

కోడుమూరు: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్లు సుమారు 400 మందికి వైద్యసేవలు అందించారు.

తొగర్చేడులో వైద్య శిబిరం..

నెరవాడ సచివాలయం పరిధిలోని తొగర్చేడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు డాక్టర్లు హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాచిరెడ్డి చంద్రమౌలీశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, డాక్టర్ గురుకుమార్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పర్లలో..

కల్లూరు: మండల పరిధిలోని పర్ల–2 సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు, స్పెషల్ డాక్టర్లు హాజరై పలువురికి మలేరియా, డెంగీ, టీబీ, మధుమేహం, హిమోగ్లోబిన్ శాతం, కంటి, గల్ల తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమక్క, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరిమద్దెలలో..

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల జెడ్పీ పాఠశాల ఆవరణంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు హాజరై పలువురికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పుల్లయ్య, సర్పంచ్ సుంకన్న, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు డాలుస్వామి, కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ జయలక్ష్మి, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వసంత్‌నగర్ శిబిరంలో వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ప్యాలకుర్తిలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ప్రజలకు కిట్‌ను అందిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

పాణ్యం: మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ స్పెషలిస్ట్ డాక్టర్లు గ్రామాలకే వచ్చి 17రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేస్తున్నారని, మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని, ఇలాంటి అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేఏఎస్ జగదీష్‌చంద్రారెడ్డి, సర్పంచ్ లింగాల శారదమ్మ, శివారెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, డాక్టర్లు సునీతా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పర్ల గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

'శాంతిరాం' విద్యార్థిని ప్రతిభ



ఏ ప్రవళిక

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థిని ఏ ప్రవళిక ఈనెల 18న అనంతపురం జేఎన్టీయూలో జరిగిన టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి, ఫిజికల్ డైరెక్టర్ మునిశేఖర్ తదితరులు అభినందించారు. వచ్చే నెల 8 న బెంగళూరులో జరిగే సౌత్‌జోన్ టెన్నిస్ పోటీల్లో తమ విద్యార్థిని పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆర్జీఎం విద్యార్థిని ప్రతిభ



శ్వేత

మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థిని శ్వేత ఆల్ ఇండియా యూనివర్సిటీ లాంగ్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విద్యార్థినిని అభినందించారు. ఈనెల 18న అనంతపురం జేఎన్టీయూలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థిని నవంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ లాంగ్ టెన్నిస్ పోటీలకు ఎంపికైందన్నారు.





కోడుమూరులో బాలత్రిపుర సుందరి అలంకరణలో శ్రీవల్లెలాంబదేవి, గూడూరులో లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం



సి.బెళగల్: ఈశ్వరాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాల్మీకి భవన్ మంజూరు చేయాలని వినతి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మేయర్

కర్నూలు (రాజ్‌విహార్): నగరంలో వాల్మీకి భవన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ కోరారు. గురువారం ఎమ్మిగనూరుకు వచ్చిన సీఎంకు మేయర్ వేదికపై వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వాల్మీకులు అత్యధికంగా ఉన్నారని, జిల్లా కేంద్రంలో వాల్మీకులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలని సీఎంను బీవై రామయ్య కోరారు.

నేడు పంటల పరిశీలన

కర్నూలు(సెంట్రల్): తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, డి.జగదీష్ పరిశీలించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలూరు, ఆదోని మండలాల్లో పర్యటించి రైతుల కష్టాలను తెలుసుకుంటారన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే నాయీ బ్రాహ్మణులకు గౌరవం



చైర్మన్ పుల్లయ్యకు స్వాగతం పలుకుతున్న సంఘం నాయకులు

కర్నూలు (అర్బన్): రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గౌరవం దక్కుతోందని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య అన్నారు. గురువారం ఆయన కర్నూలుకు వచ్చిన సందర్భంలో స్థానిక నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. జగనన్న చేదోడు పథకాన్ని నిర్విరామంగా కొనసాగిస్తూ కుల వృత్తిపై ఆధారపడిన వేలాది నాయీ బ్రాహ్మణులకు ఆర్థికంగా సహాయ సహకారాలను అందిస్తున్నారన్నారు. నాయీ బ్రాహ్మణులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలన్నారు. అనంతరం సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రమణమూర్తిని ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్ స్వామిచంద్రుడు, కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు



కోడుమూరులో శ్రీవల్లెలాంబదేవికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

కోడుమూరు: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవానీ, శ్రీఅంబా భవానీ, శ్రీవల్లెలాంబదేవి ఆలయాల్లో అమ్మవారు బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారికి రాత్రి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి పల్లకీ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీ దేవీగా అమ్మవారు

గూడూరు: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఐదవ రోజున గురువారం అంబాభవానీ మాత భక్తులకు లక్ష్మీదేవీ అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





పాణ్యంలో లలితాదేవి, మహాచండీదేవి అలంకరణలో అమ్మవారు

శ్రీ చండీగాదేవి అలంకరణలో అమ్మవారు

సి.బెళగల్: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం సి.బెళగల్‌లోని ఈశ్వరాలయంలో కొలువైన అమ్మవారు శ్రీ చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత బస్టాండ్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి శ్రీ మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ, ఊయల సేవలను నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు.

పాణ్యంలో..

పాణ్యం: దసరా నవరాత్రులు పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అమ్మవారు లలితాదేవిగా, కన్యాకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. రైల్వే గేటు వద్ద ఉన్న అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గడివేములలో..



గాయత్రీదేవి అలంకారంలో వాసవీమాత

గడివేముల: మండల కేంద్రంలోని వాసవీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీ మాత గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళహారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

- 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల కేటాయింపు
- రూ.96 లక్షలతో జరుగుతున్న పనులు

కల్లూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారు. సచివాలయాల ఏర్పాటుతో జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకువచ్చారు. వలంటీర్లను నియమించి ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేరుస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ప్రజాప్రతినిధులను గ్రామాలకు పంపి సమస్యలు తెలుసుకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామాల్లో పర్యటించారు. సమస్యలు తెలుసుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయించారు.



రెమడూరు డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



చిన్నటేకూరులో నిర్మించిన సీసీ డ్రైనేజీ

ఎనిమిది పంచాయతీలలో..

మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన గ్రామ సచివాలయం అభివృద్ధికి ప్రభుత్వం రూ. 20 లక్షలు కేటాయిస్తుంది. అందుల్లో 8 గ్రామ పంచాయతీలకు రూ.96.40 లక్షలు నిధులు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కేటాయించారు. నెరవాడకు రూ.10 లక్షలు, బొల్లవరం రూ.5 లక్షలు, చిన్నటేకూరు రూ.20 లక్షలు, కే.మార్కాపురం రూ.12 లక్షలు, పెద్దటేకూరు రూ.8 లక్షలు, కొంగనపాడు రూ.20 లక్షలు, ఉలిందకొండకు రూ.15 లక్షలు, రెమడూరుకు రూ.40 లక్షలు కేటాయించారు. ఇప్పటికే నెరవాడ, బొల్లవరం, కే.మార్కాపురం, కొంగనపాడు గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణాలు పూర్తయ్యాయి. చిన్నటేకూరు, రెమడూరు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. పెద్దటేకూరు, ఉలిందకొండ, కేపీ తండాల్లో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.



కే.మార్కాపురంలో నిర్మించిన సీసీ డ్రైనేజీ

సమస్య తీరింది



సీసీ డ్రైనేజీ లేక మురుగు రోడ్ల మీద చేరి దుర్గంధం వెదజల్లేది. పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉండేవి. దోమల బెడదతో నిద్ర వచ్చేది కాదు. రోగాల బారిన పడేవాళ్లం. ప్రస్తుతం డ్రైనేజీ నిర్మించడంతో సమస్య తీరింది.

– ఎం.నబీసాహెబ్, చిన్నటేకూరు

నాణ్యత ప్రమాణాలతో పనులు



గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ డ్రైనేజీల నిర్మాణాలు నాణ్యతతో చేపడుతున్నాం. ఇప్పటికే నెరవాడ, బొల్లవరం, కొంగనపాడు, కే.మార్కాపురం గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. చిన్నటేకూరు, రెమడూరు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. పెద్దటేకూరు, ఉలిందకొండ, ఉలిందకొండ మజారా గ్రామమైన కేపీ తండాలో త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, కల్లూరు